ప్రేక్షకుల్లో ఉన్న గేదెలను జూచి బ్యాండు వాళ్ళు చెరో ప్రక్కకు వత్తిగిల్లారు.

అంకముమీదు తొలగించే 'కర్టెన్'లా బ్యాండువాళ్ళు తప్పుకోగా- రంగస్థలంపై ఉన్న నటుడు, ప్రేక్షకుల్ని చూచే సదవకాశము లభించినట్లు- రామబాణాల్లా దూసుకొచ్చేస్తున్న గేదెలను అశ్వారూఢులైన కౌరవులుజూచి- గాలి విసురుకు గడ్డిమేటుల్లా పడి- కళ్ళు చెమ్మగిల్లి- స్పృహతప్పి పడిపోయారు.

తోడేలును జూచిన గొఱ్ఱెల గుంపులా- రమారమి పందగుఱ్ఱాలు చెల్లా చెదరయిపోయాయి. రెప్పపాటులో జరిగిపోయిందిదంతా.

మళ్ళీ కొన్ని ఓట్లు పేల్చారు. ఇక్కడ జరిగేది, ఆ పేల్చేవారికి కనిపించదుగా! ఎదుటి గందరగోళం చూచి—వెనుకనుంచి వస్తున్న మందుగుండు ప్రేలుడు శబ్దానికీ—మరీ జడిసిపోయి, 'వెనుదిరిగి పోవటం వీరోచితలక్షణం కాదని' అనుకొన్న కౌబోలు—సంభ్రమంలేపే పరుగు లంఘించాయా గేదెలు—అరేబియా గుఱ్ఱాల్లా.

“ఏం గున్నయ్యా! ఎవరైనా గేదెల పందాలేశారట్రా?!” చావిట్లోకి గంతేసి అన్నాడు కరణం. “నిజమే నేమో బాబయ్యా!” శ్రుతి కలిపాడు పాలేరు. హరిదాసు—హాయనుల హంగామా చూచి 'హరహర' అంటూ పరుగు తీశాడు, పంచెదీసి- యజ్ఞశాలలో ప్రవేశించిన ప్రమథగణాల్ని చూచిన దక్షప్రజాపతిలా.

వెనుక ఉన్న రథాలు (బండ్లు) చుక్కాని లేని పడవల్లా సుళ్ళు తిరిగాయి.

“చచ్చాము బాబోయ్” అంటూ వేసవిలో బీటలు వేసిన పంట పొలాల్లా నోళ్ళు తెరచి—అరిచారు, వేషధారులు. శ్వాస పగతిన్న కుప్పలా కూలిపోయారు నటులు.

కెవ్వుమన్నారు కాలయాండ్రు. నత్తగుల్లలా ముడిచుకు పోయారు. కొందరు తొలి బహుమానము పొందుదామని పరుగు పందెంలో పరుగిడే మగరాయుళ్ళ మాదిరి తలోకవైపు దౌడు తీశారు. ఇదే తరుణమన్నట్లు—రసికులు కొందరు సాగుతున్న ఉద్యమానికి మధ్య దాపురించిన అభివృద్ధి నిరోధక శక్తుల్లా వాళ్ళను ఢీకొంటున్నారు. కోయవాండ్రు తరయ్ తయ్ మంటు కోతుల్లా ఎగిరిపోయారు.

సంబరాన్ని చీల్చి దూసుకొచ్చే తన సహచరులను, మహిషము శాంతంగా చూచింది. “ఆగండి! నేనూ వస్తున్నా” అన్నట్లు ఒక్క దూకు దూకింది. ఆ ఊపుతో—మన యముడు—కుమార సంభవములోని, యముడువలె—ఆ దున్నపోతు మీద వ్రేలాడుతున్నాడు.

ఇక...సంబరాన్ని సంబరపడుతూ చూచే ప్రజలు భయంతో—తామరాకుపైనపడ్డ నీటి బొట్లలా వారి కండ్లు అల్లలాడి స్థానభ్రంశం పొంది—కంటి గ్రుడ్లు రాలిపడిపోతున్నాయేమో! అనిపించింది. వాళ్ళ ప్రాణాలు పైపైకే గాలిలో కి కారుకు బయలుదేరుతున్నాయేమో! అన్నట్లు స్ఫురించింది. ప్రజలు యిళ్ళకి దారితీశారు.

పల్లెప్రజల ఆర్తనాదములు మిన్నంటాయి. మిన్నంటిన శబ్దాల్లో—హరిదాసును దూషించిన వాక్యాలు. శపించిన శాపశబ్దాలు—నిఘంటువుల్లో కనిపించని 'తిట్లు' పదాలు—ఆడిపోసుకున్న వికృతపు మాటలు—“హరిదాసు ఎంత పని చేశాడ”ని అపార్థం చేసుకున్న పదప్రయోగాలు, కొన్ని...హరిదాసును వెక్కిరిస్తున్నట్లు ప్రతిధ్వనించాయి. ★

# అత్తాకోడళ్ళ పోరు

(13-వ పేజీ తరువాయి)

దద్దమ్మలా వున్నాడు. పెళ్లాన్ని అంతలా కరివేపాకు వేపినట్టు వేపుకుతింటూంటే కన్నతల్లిని కొస్తంతయినా గదమాయించడే!—అయినా యింతకూ ఆ చేతగాని చవట సన్నాసిమాకలేస్తే మాత్రం ఓపట్టాన ఆ భూతం వింటుంది గనకా!—వాడేవరయినా తప్పి జారి చెప్పేందుకు వెళ్ళాడే అనుకోండి. వాణ్నికూడా యిదా-పెడా వాలుగంటించి ఓ మూలని కట్టి పడేస్తుంది.

కానీ మనసులో వున్నదేదో మర్మం లేకుండా చెప్పెయ్యాలిగా మరి!—పాపం ఆ యింటి కోడలిపైనీ—ఆమె తాలూకు చేతగాని మొగుడిపైనీ నాకెందుకో మహా జాలీ—దయా పుట్టుకొచ్చింది. ఆ కోడలి వంటి మహాలక్ష్మిదేవి యీ కాలంలో యే మూటికో—కోటికో యొక్కడో వుంటుంది. పొద్దుట లేచింది లగాయితు రాత్రి కన్ను మూసేవరకూ యెన్ని తిట్లూ—యెన్ని చీవాట్లూ!—ఆహాహా—అంతయినా ఆ అమ్మాయి పాపం కిక్కురుమనదుగదా! అంత ఓర్పూ- అంతశాంతం ఈ రోజుల్లో వయసులోవున్న యే అమ్మాయి కుంటుంది చెప్పండి. తనేవిటో - తన పనిపాట్లేవిటో, అంతే!- పైపెచ్చు అంత గయ్యాళి అత్తగారికి తనే ముద్దకూడు తినిపిస్తుందంటే నమ్మండి. అవిడకి అడ్డమైన చాకిరీ చేస్తుంది. ఆహా! అలాటి ఆడకూతురి మొహం చూస్తే చాలు. పుట్టెడు పుణ్యం మూటగట్టుకోవచ్చు. జన్మ తరించిపోతుంది.”

శరత్ బాబు యీ వైరిభాగుల కోడలికథ చెబుతూ చెబుతూ ఆ గుంపులో అత్తా-కోడళ్ళ తాలూకు అవతారా లెలావున్నాయో ఓ కంట కనిపెడ్తూనే వున్నాడు. అత్తలంతా ఆముదం తాగిన మొహాలు పెట్టుకుని ఆయన వేపు మింగేస్తామన్నట్టు మహా వుక్రోషంగా చూస్తున్నారు. కోడళ్ళంతా కొత్తెక్కి మొహాలు చేటలంతేసి చేసుకుని, అత్తల్ని పెఱుగు జాత్తినట్టు జాత్తిద్దామా అన్నంత గఱ్ఱాగా చూస్తున్నారు.

శరత్ బాబు మళ్ళా కథ మొదలెట్టాడు,- “ఆమధ్యన ఓహానా డేమయిందీ మందువాలో నేనటూ యిటూ పచార్లు చేస్తున్నా. అదే సమయానికల్లా పొరుగింటి అత్తగారు తిట్లదస్త్రాలు తిరగేసి చెవులు గొల్లుమనిపిస్తోంది. 'అయ్యో - నీ పెత్తనం బండలు కాను - నీ బడాయి తంపటె య్యా నీ మొహం యీడ్వా-నా కొడుకుని లోబర్చుకున్న సంగనాచీ”అంటూ ఏక బిగిని ఒహాటే రాణాగోల! - ఆవేళ హాశ్రం బాగాలేదు. పొద్దుట లేవగానే రాట్నం కొసన్నె వాడికాను.

పాపం ఆ అమాయకురాలిపైని మళ్ళా పిడుగులవర్షం పడటంతో ఆవేళ యేదోలా వున్నా ఆ గందరగోళమేవిటో స్వయంగా కళ్ళారా చూడాలనివుబలాట పడ్డాను. అందుకని పక్కనున్న ప్రహారీగోడవారకెళ్ళి కొన్ని యిటుకల్ని ఒహాదానిపై నింకోహాటి పేర్చి తింపాదిగా దానిపైకెక్కి నిలబడ్డాను. అలా నుంచుని ఆ యింటివేపు మొహం పెట్టి చూద్దునుగదా!- ఒఖ్ఖసారే భూమీ-ఆకాశం గిర్రున తిరిగిపోతున్నట్టనిపించింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. కాళ్ళు పట్టు తప్పిపోయాయి. అంతవరకూ నేననుకుంటున్నవన్నీ గాలి కుమ్మటాల్లా పైకెగిరిపోయాయి. నా తలంపులన్నీ తలకిందులై పోయాయి.

ఇంతకూ ఆ యింట్లో యేం చూశాననుకున్నారు!- అప్పటికింకా ఆ యింట్లో ఇంకోరెవ్వరూ లేవలేదు. వాకిట్లో అత్తాకోడళ్లు మాత్రం అవుపించారు. కోడలేమో పల్లెత్తు మాటకూడా అనటంలేదు. కాని మధ్యమధ్య ఆమె అత్తవేపు చీపురు ఝాడిస్తూ వాళ్ళు చీరేస్తా నన్నట్టు గ్రుడ్లురుముతూ చూస్తోంది. “జాగ్రత్త, కబడ్దార్” అంటున్నట్టు సైగలతో దాబులు కొడ్తోంది. ఆమె యెంత అణకువగలిగిన అమ్మాయనుకున్నానో-అంత రాకాసిపిల్లనుకునే చేష్టలన్నీ చేస్తోందంటే నమ్మండి. ఒకోసారి కిక్కురుమనకుండానే అత్తపైని అపాదమపా చీపురుకట్టతో వడ్డిస్తోంది కూడాను;- ఇహ ఆమెగారి అదిరింపులూ-బెదిరింపులూ చెప్పడాని కలవిగాదంటే నమ్మండి. పాపం నిసుపడి కుమిలిపోతున్న ఆ అత్తగారు వుండుండి వుండబట్టలేక ఒక్కసారి కోడల్ని గబగబా తిట్టేస్తోంది.”—

శరత్ చంద్రుడి కథ కాస్తా పూర్తయింది. అంతవరకూ రోజాపువ్వుల్లా కిలకిలమని నవ్వుతూన్న కోడళ్ళ మొహాలన్నీ దీంతో వెలవెలమని కొయ్యబారి పోయాయి. రాచిప్ప మొహాలు పెట్టుకున్న అత్తలంతా ఆనందంతో పకపకలూ, వికవికలూ ప్రారంభించారు. ★